## 23. కిరసనాయిలు-పంచరత్నాలు

"సుబ్బకవి గారి షష్టిపూర్తి సన్మాన సంచికకు మీరో అమూల్యమైన వ్యాసం వ్రాసివ్వాలి!" అనడిగారో పెద్దమనిషి!

సుబ్బకవి గారెవరో నాకు గుర్తుకు రాలేదు "ఎవరండీ ఆ మహాకవి?" అనడిగాను.

"మనూళ్ళో ఉన్నది ఒక్క సుబ్బకవే గదండీ, మరెవరున్నారు? మన పెద్ద బజారులో హోల్ సేల్ కిరాణా మర్చంట్ సుబ్రశెట్టిగారి సంగతే నేను చెప్తూంట" అన్నారాయన.

ఎదురుగా ఉన్నవాడిని ఈడ్చి లెంపకాయ వెయ్యాలనిపించింది నాకా క్షణాన. కానీ, ఆయనగారు నిజంగానే పెద్దమనిషి! నోట్లో వేలు పెడితే కొరక్కుండా "తప్పు తమ్ముడూ! నీ వేలు నొప్పెడుతుంది!" అని హితవు చెప్పేటంత మంచివాడు.

అందుకని నేనాయన దవడ జోలికి వెళ్ళలేకపోయాను "నేను అమూల్య రచనలు చేసేటంత గొప్ప రచయితను కాదండీ!" అని తప్పుకోబోయేను.

సుబ్బిశెట్టిగారు కొంత కవిత్వం రాసిన మాట నిజం. మరికొంత అంకితాలుగా పుచ్చుకొన్నమాటానిజమే. శ్రీవారికి కొంత అజీర్ణరోగం, మరికొంత తామర గజ్జి ఉన్నాయనీ, అవి దురదపెట్టినపుడల్లా ఆ బాధతో కొంత కవిత రాశారనీ గిట్టని వాళ్ళు అంటూంటారుగానీ మనం నమ్మగూడదు. అయినా బాధలోంచేగదా కవితాధార రాలేది.

'అయితే, అమూల్య వ్యాసంవద్దు మూల్యంగల రచనే వ్రాసివ్వండి! సన్మాన సంచికలో రాసే ప్రతి రచయితనూ సుబ్బకవిగారు షష్టిపూర్తినాడు నూటపదహార్లతో సత్కరించ బోతున్నారు.' అన్నారా పె. మనిషిగారు.

నాకొంచెం ఆశపుట్టినమాట నిజం. నాకింతవరకూ నూటపదహార్లిచ్చిన భోజుడెవడూ లేడు. 'బాగానే ఉంది గానీ సార్? ఆ నూటపదహార్లకు బదులు శ్రీవారి దుకాణంలో మాకందరికీ తలా ఓ పది కిలోల పంచదార, మరో పాతిక లీటర్ల కిరసనాయిలు ఇప్పించే ఏర్పాటు చేస్తే బాగుండును గదాండీ, అవెక్కడా దొరక్క చస్తున్నాం" అని ఓ సవరణ ప్రతిపాదించాను.

ఆయనగారు ఇబ్బందిగా మొహం పెట్టేరు. 'అదెలా కుదురుతుంది తమ్ముడూ; అవి మీకు అందకుండా ఆటకమీద ఉండబట్టేగదా. సుబ్బకవిగారు ఉదారంగా నూటపదహార్లు ఇవ్వ గలుగు తున్నది" అన్నారు.

'కానీ పంచరత్నాలు రాయాలంటే తూగుటుయ్యాలా

రమణీప్రియ దూతిక చేతికప్పురపు విడెమూ లేకున్నా కనీసం టీ నీళ్ళన్నా కావాలిగదండీ! టీ కాచుకోవాలంటే కిరసనాయిలుండాలి. టీ త్రాగగలగాలంటే అందులోకి పంచదార ఉండి తీరాలిగదా?"

ఆయనగారు కొంచెం ఖిన్నులయ్యేరు. 'అవును గానీ తమ్ముడూ? సాహితీపరులమైన మనం మనరచనల్ని కిరసనాయిల్తోనూ, పంచదారతోనూ ముడిపెట్టుకోవటం ఘోరం. పోతన్నగారేమన్నారు? తన కవితా కన్యను కూళలకిచ్చి అన్యాయం చేయబోనని గాదా?' అన్నారాయన.

"కానీ పోతన్నగారు సుబ్బశెట్లకివ్వమని సలహాలివ్వ లేదు కదాండీ!" అని నా అనుమానం వెలిబుచ్చేను.

"నిజమే! కానీ, సుబ్బశ్రేష్ఠిగారు 'నరాధముల' జాబితాలోకి రారు గదా. నాకు కావాల్సినపుడల్లా కాస్తో కూస్తో పంచదారా, కిరసనాయిలూ, చింతపండూ మార్కెట్ రేటుకే ఇప్పిస్తున్నారే!"

నేనేమనలేకపోయేను. నాకాయన మీద జాలి కూడా కలగలేదు ఆయనగారు సుబ్బశ్రేష్ఠిగారికి తీరిక సమయాల్లో పద్యాలు రాసి పెడుతుంటాడని రూమరు. కాదు, సాహిత్యగోష్ఠి జరుపుతూంటాడని సమాధానం. ఆ మాత్రం ప్రభుభక్తి ఉండటం మంచిదే గదా?

"అయినా సుబ్బశ్రేష్ఠిగారు తమ షష్ఠిపూర్తి సన్మా

నాన్ని తామే ఏర్పాటు చేసికోవటం, సన్మాన సంచికకు తామే డబ్బిచ్చి అచ్చేయించుకోవటం ఏం ఖర్మండీ!" అనడిగేను.

పె. మనిషిగారు మందహాసం చేశారు. "మీ కుర్రతరం వాళ్ళకి మన భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలూ సరిగా తెలీవు తమ్ముడూ! చూడూ! మనల్నేలిన నవాబులంతా బ్రతికుండగానే తమ కోసం బ్రహ్మాండమైన సమాధులు కట్టించుకో లేదా? నవాబులు కానివాళ్ళు అలాంటివి చేయకున్నా గుళ్ళూ, గోపురాలు, చెట్లు నాటించటాలూ వంటివి చేశారు గదా! తప్పేముంది?"

అవునవును! వాళ్ళంతా బ్రతికుండగానే గాక చచ్చాక కూడా జనం తమ జోలికి రాకుండా ముందే జాగ్రత్తపడ్డారు. తాజ్ మహాలే లేకుంటే షాజహాన్ ఎవడో, వాడిచేత తెల్ల రాళ్ళకోసం జనాన్ని దోపిడీచేయించిన వాడి ముద్దుల ప్రేయసి ఎవరో మనకేం తెలిసేది?

"అన్నట్లు మీరు తాజ్ మహాల్ మీద ఓ ఖండకావ్యం రాసి సుబ్బశ్రేష్ఠిగారికి అంకితమిచ్చారు గదాండీ! నేనిమధ్య ఆగ్రా వెళ్ళేను కానీ, నాకు తాజ్ మహాల్లో మీరు వర్ణించిన అందాలేమీ కనపడక పోగా బోసిగా, బోడిగా కనుపించిందేమిటండీ?" అని నా అనుమానం వెలిబుచ్చేను

పె. మషిగారు మరలా ఖిన్నులయేరు. "దేనినయినా అస్వాదించేందుకు కొంత కళాదృష్టి కావాలి తమ్ముడూ!

అయినా అక్కడ ఈ మధ్య బిచ్చగాళ్లెక్కు వయిపోయేరు. తాజ్ మహాల్ అందం అంతా మరుగున పడిపోయుండొచ్చు! అన్నట్లు సుబ్బ కవిగారు షష్టి పూర్తినాడు వేయిన్నూట పదారుగురు ముష్టి వాళ్ళకు అన్నదానం చేయబోతున్నారు. తెలుసా!'' అన్నారు.

సుబ్బశ్రేష్టిగారి ధర్మ గుణానికి నేను అయిష్టంగానే కాస్త సంతోషించేను. "అయితే చాలా ఖర్చే అవుతుందనుకుంటాను! ఉత్తపుణ్యానికి ఇంత డబ్బెందుకు తగలేస్తున్నారండీ సుబ్బశ్రేష్టిగారు?'' అని నా అనుమానం వెలిబుచ్చేను.

పి. మనిషిగారు తటపటాయించేరు. "అదంతా సుబ్బ కవిగారి డబ్బే కాదనుకో తమ్ముడూ! నిజానికి సుబ్బ కవి గారికి ఇలాంటి ఖర్చులు ఇష్టంలేదు. కానీ వారికి ఈ మధ్య కొన్ని ఇబ్బందులొచ్చి పడ్డాయి. దుకాణాలు తనిఖీ చేసే ఆఫీసర్ల మామూళ్లూ, తాటింపులూ ఎక్కువయి పోయేయి. అందుకని సుబ్బ కవిగారి హోల్ సేల్ దుకాణాల మీద బ్రతికే వారి చిల్లర దుకాణాల బంధువులంతా కలసి ఓ ఆలోచన చేసేరు. మన వాడొకడు పెద్ద హోదాలో, పదవిలో ఉంటే ఈ లంచగొండ్లను మన జోలికి రాకుండా అదుపులో పెడతాడు గదా! అలాంటి దానికి అర్హుడు కాస్తో కూస్తో కవిత్వం రాసి పేరు తెచ్చుకున్న మన సుబ్బశ్రేష్టే అని తేల్చుకున్నారు. అందుకని అంతా చందాలేసుకుని షష్టిపూర్తి సాకుతో తమ బలాన్నంతా కూడగట్టి అందర్నీ అదరగొట్టా

లనుకున్నారు. సుబ్బకవిగారికి త్వరలో అకాడమీ సభ్యత్వం, పద్మశ్రీ రావడం ఖాయం. ఆ తర్వాత ఆయన్ని పంచదార, కిరసనాయిల్ మర్చంట్స్ ప్రతినిధిగా అసెంబ్లీకి నామినేట్ చేయక చస్తారా ఏలినవారు?"

గీతోపదేశం వింటూన్న అర్జునుడిలా నేను మంత్ర ముగ్ధుడినయిపోయేను.

కాస్సేపటికి తేరుకుని అడిగాను. "కానీ, ఏలినవారికి ఇవన్నీ చేయాల్సిన ఖర్మేమిటండీ! వాళ్ళంత దద్దమ్మలా?"

పె. మనిషిగారు చిరు మందహాసం చేశారు. "నీకింకా చిన్నతనం తమ్ముడూ? సుబ్బశ్రేష్టిగారి కులంవాళ్ళీ ఊళ్లో ఎందరున్నారో తెలుసా? వాళ్ళు చందాలివ్వడం మానేస్తే ఏలినవారికి పార్టీ ఖర్చులెలా? చచ్చినట్లు చేస్తారు. చూస్తా వుగా, అన్నట్లు అమూల్య వ్యాసంగానీ, మూల్య రచనగానీ వ్రాయటం మర్చిపోకేం?" అని శెలవు దీసుకున్నారు.

నెలదాటినా నేను పంచరత్నాలు రాయలేకపోయాను. మరేం లేదు. ఇంట్లో గొడవలే. తెల్లారితే ఆదిలేదు. ఇది అయి పోయిందని మహాజర్లు సమర్పించేది మా ఆవిడ. అని తెద్దా మంటే సుబ్బశ్రేష్టిగారి చుట్టాల్లో నాకు తెలిసి, ఉదారంగా అసలు ధరకు ఇచ్చేవాడు ఒక్కడూ లేడు. వాళ్ళు చెప్పే ధరకు కొనే తాహతు నాకు లేదు. ఫలితంగా, టీ నీళ్లూ లేవు.

పంచరత్నాలూ లేవు. కానీ, హాటాత్తుగా ఓ తెల్లవారు జామున పదో క్లాసు చదివే మా బుడ్డోడు అరబస్తా పంచదార, నాలుగు డబ్బాల కిరసనాయిల్తో ఇంట్లో ప్రత్యక్షమయ్యేడు.

మావాడూ, సుబ్బిశ్రేష్ఠి కొడుకూ క్లాస్ మేట్లు. అత గాడు అరువుగా ఇప్పించాడేమోనని నేను సంతోషించేను.

ఓ అరగంటలో చక్కటి, చిక్కటి కాఫీ ఇచ్చింది మా ఆవిడ. తాగి అర్జంటుగా పంచరత్నాలు రాసి పె. మనిషి గారిని వెదుక్కుంటూ వెళ్ళేను.

కానీ పె. మనిషిగారు నా పంచరత్నాల్ని చూసి సంతో షించలేదు. "అవలా వుండనీయవయ్యా! మన కార్యక్రమం అంతా తలక్రిందులయ్యేట్లుంది. నీకు తెలీదా ? రాత్రి ఎవరో గానీ సుబ్బరవిగారి దుకాణాల్ని లూటీచేసేరు. గోడలూ, తలుపులూ తప్ప మరేం మిగలలేదు." అని వాపోయేరు.

దేశం దారి తప్పిపోతున్నందుకు చింతిస్తూ నేను కొంపకు చేరేను. "ఎక్కడివే! ఇవన్నీ?" అనడిగేను మా ఆవిడని.

ఆవిడ చిరునవ్వు నవ్వింది. ఆ వెంటనే చురచురా చూసింది. "మీరూ ఉన్నారు ఎందుకూ?" అన్నట్లు.

(ఆగస్ట్ 1973)